క్లుప్తంగా

నిమ్మ రేటు ధమాల్

కిలో రూ.55కు పడిపోయిన వైనం

దేవరపల్లి: నిమ్మ మార్కెట్ రైతులకు నిరాశ పరిచింది. సోమవారం మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.50 నుంచి 55 పలకడంతో రైతులు డీలా పడ్డారు. ప్రస్తుత సీజన్లో కిలో రూ.80 పలకడంతో మార్కెట్పై రైతులు ఆశలు పెంచుకున్నారు. గతేడాది కిలో నిమ్మకాయలు రూ.180 లభించడంతో ఈ ఏడాది కూడా గిట్టుబాటు లభిస్తుందని వారు ఆశించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల మార్కెట్ పడిపోయిందని, మార్చిలో ఈ విధంగా మార్కెట్ పడిపోవడం గతంలో ఎప్పుడూ జరగలేదని రైతు అనిశెట్టి సూర్యచంద్రరావు తెలిపారు.

త్వరగా లేఅవుట్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



తీరుగూడెం జగనన్న కాలనీ లేఅవుట్ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్నాయుడు సూచించారు. పట్టణంలోని తీరుగూడెంలో వైఎస్సార్ జగనన్న లేఅవుట్ను ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేసి లేఅవుట్లో రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవిలో లేఅవుట్లు అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ డీఈ ఎస్.చంద్రశేఖర్, ఏఈ గిరీష్, టీపీఓ కె.సుజాత పాల్గొన్నారు.

దొరబాబుకు ఎమ్మెల్యే వెంకట్రావు పరామర్శ

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం పంచాయతీ సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబును గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. దొరబాబు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ రాజేంద్రబాబు, పార్టీ మండలశాఖ అధ్యక్షులు కూచిపూడి సతీష్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్యేను కలసిన వజీరుద్దీన్, రాంబాబు

నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఎస్కే వజీరుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితుడైన పొట్టి రాంబాబులు సోమవారం నిడదవోలులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయులకు పుట్టినిల్లు ఆంధ్ర ప్రాంతం

నల్లజర్ల: మహనీయులకు పుట్టినిల్లుగా ఆంధ్ర ప్రాంతం భాసిల్లుతోందని హిమాలయ యోగీశ్వరులు సత్ సందానందగిరి అన్నారు. దూబచర్లలోని దత్తసాయి పంచావతార మహాపీఠంలో సప్త, సహస్ర రూప శ్రీగురు చరిత సప్తాహ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. ఐదో రోజై క్రతువుకు సోమవారం సత్ సదానందగిరి ముఖ్య అతిథిగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. 52 మంది దంపతులు పూజాధికాలు నిర్వహించారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలి

చాగల్లు: మూతబడిన చాగల్లు చక్కెర కర్మాగారాన్ని తెరిపించి కార్మికులను, రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు కేకే దుర్గారావు, జుజ్జవరపు శ్రీనివాస్ కోరారు. కొవ్వూరు మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ నుంచి చాగల్లు పంచాయతీని మినహాయించాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎంపీడీఓ బి.రాంప్రసాద్కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఇది పరీక్ష కాలం



అన్నదేవరపేట జెడ్పీ హైస్కూల్లో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి ఎగ్జామ్స్
- నియోజకవర్గంలో 2,933 మంది విద్యార్థుల హాజరు

తాళ్లపూడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా పరీక్షే. ఏడాదంతా కష్టపడి చదివిన పాఠ్యాంశాలను మంచి మార్కులుగా మలచుకోవడానికి మరెన్నో రోజుల సమయం లేదు. వచ్చే నెల 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళికతో జవాబులు రాయాలి. పరీక్షల సమయంలో విద్యార్థులు ఏ మాత్రం మానసిక వత్తిడికి గురవకుండా తల్లిదండ్రులు చూడాలి. వారిలో ఒత్తిడి, ఆందోళన, భయం, అనారోగ్యం వంటి వాటిని దూరం చేసేందుకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల తోడ్పాటు చాలా అవసరం.

కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుంచి 2,933 మంది విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. తాళ్లపూడి మండలంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం, మలకపల్లిలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలం నుంచి 550 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కొవ్వూరు మండలం నుంచి 1,706 మంది, చాగల్లు మండలం నుంచి 677 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- విద్యార్థులు తమ తోటి విద్యార్థులతో తమను పోల్చుకోరాదు.
- పక్కవారి గురించి ఆలోచించడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది.
- ఏ సమస్య వచ్చినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలి.
- వెనుకబడిన సబ్జెక్టులపై దృష్టి సారించాలి.
- ఎల్లప్పుడూ పాజిటివ్ ఆలోచనలతో గడపాలి.
- తగినంత సేపు నిద్రపోవాలి. సరైన ఆహార నియమాలు పాటించాలి.
- సరిపడా మంచి నీరు తాగాలి.

తల్లిదండ్రులు ఇలా వ్యవహరించాలి

పిల్లలు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిపై ఒత్తిడి చేయకూడదు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా చూడాలి. వారి మానసిక పరిస్థితులను అర్థం చేసుకోవాలి. వారితో సున్నితంగా వ్యవహరించాలి. స్ఫూర్తిని నింపేలా మెలగాలి. ఇంట్లో చదువుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. టీవీలు పెట్టడం, అనవసర సంభాషణలు పెట్టకూడదు. వేళకు మితంగా ఆహారం ఇవ్వాలి. వీలైనంత వరకు తాజా పండ్లు పెట్టాలి.

టెన్త్ పరీక్షల టైం టేబుల్

ఏప్రిల్ 3న తెలుగు, కాంపోజిట్ పేపర్, 6న హిందీ, 8న ఇంగ్లిషు, 10న గణితం, 13న సైన్సు (ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, 15న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి 12.45 వరకూ పరీక్షలు జరుగుతాయి

పరీక్షలపై భయం పోగొట్టారు



పరీక్షల సమయంలో ఎలాంటి వత్తిడికి గురి కాకూడదని మా ఉపాధ్యాయులు చెప్పారు. ముఖ్యంగా పరీక్షలు అంటే మనసులో సహజంగా ఉండే భయాన్ని జయించాలన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించడానికి ప్రణాళికాబద్ధంగా చదువుతున్నాం.

-కె సుజిత, పదో తరగతి, విద్యార్థిని, తాళ్లపూడి మండలం

హ్యాండ్ రైటింగ్లో మెళకువలు



మంచి మార్కులు సాధించడానికి పరీక్షల్లో చేతిరాత ముఖ్యమని ఉపాధ్యాయులు వివరించారు. సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు పొందికగా ఉండాలని తెలిపారు. పేజీకి 16 నుంచి 20 లైన్లకు మించి రాయకూడదని మా ఉపాధ్యాయులు సూచించారు.

- బి.భార్గవ్, పదో తరగతి, అన్నదేవరపేట హైస్కూల్

ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి



ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించాం. ప్రీ ఫైనల్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారించి వారు కూడా పాస్ మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాం. ప్రతి విద్యార్థీ పరీక్ష సమయానికి అరగంట ముందుగానే సెంటర్కు చేరుకోవాలి.

- కె.వివేకానంద, ఎంఈవో, తాళ్లపూడి

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

తాళ్లపూడి: సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న టెన్త్ విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం అల్పాహారం అందజేశారు. మండలంలోని గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 42 మంది విద్యార్థులకు ఆ సంస్థ సభ్యుల చేతుల మీదుగా ఈ అల్పాహారాన్ని అందించారు. మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు పురపాలక సంఘ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేవీ పద్మావతి సోమవారం తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ నాయకుల అర్ధనగ్న ప్రదర్శన

గోపాలపురం: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు మండలంలోని గుడ్డిగూడెంలో సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జి జేష్ఠ సతీష్బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్రావు, బ్లాక్-1 అధ్యక్షుడు కౌలూరి రతన్రాజు, జిల్లా కార్యదర్శి సుంకర సత్యనారాయణ, ఎస్ సోమరాజు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలకు కృషి

- ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడు
- నిడదవోలు ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక పరిశీలన



వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడు

నిడదవోలు రూరల్: ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్నాయుడు అన్నారు. నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. వారితో స్వయంగా మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్నాయుడు మాట్లాడుతూ సీజనల్తో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు 8 మంది డాక్టర్లు ఇక్కడ అందుబాటులో ఉన్నారన్నారు. ఆసుపత్రిలో వైద్యసేవలు సంతృప్తికరంగా ఉండడంతో ఓపీ సంఖ్య బాగా పెరిగిందన్నారు. ప్రసూతి, కంటి, దంత సేవలతో పాటు బ్లడ్ బ్యాంక్ను అందుబాటులో తీసుకు వచ్చామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నాడు-నేడు పథకం ద్వారా ఆసుపత్రులలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాస్నాయుడు చెప్పారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుర్రం జేమ్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలన్నీ మహిళలకే

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేత



గోపాలపురంలో ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచీ రాష్ట్రంలో ఎక్కువ పథకాలను మహిళలకు అందించిన ఘనత వైఎస్ జగన్మోహన్రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గోపాలపురం ఏఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ కూడా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన దాఖలాలు లేవన్నారు. పసుపు కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలను నిలువునా ముంచిన ఘనత చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్మోహన్రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. గోపాలపురం మండలంలోని 1264 డ్వాక్రా గ్రూపులకు రూ.10.07 కోట్లను మూడో విడతలో ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. ఈ మేరకు నమూనా చెక్కును ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, డీఆర్డీఏ పీడీ ఎం.సుభాషిణి, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు వింత శ్రావణి, రాష్ట్ర క్రీడల విభాగం డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, పలువురు ఆ పార్టీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ పంచాయతీల సర్పంచులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడే ఆసరా చెక్కుల పంపిణీ

పెరవలి: మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మంగళవారం వైఎస్సార్ ఆసరా చెక్కులను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్నాయుడి చేతుల మీదుగా పంపిణీ చేస్తారని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ సోమవారం తెలిపారు. మండలంలోని కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు గ్రామాల లబ్ధిదారులకు మంగళవారం ఉదయం కానూరులోని వైనాట్ ఫంక్షన్ హాల్లో చెక్కు అందజేస్తారని చెప్పారు. అలాగే మిగిలిన గ్రామాల లబ్ధిదారులకు మధ్యాహ్నం కాపవరంలో చెక్కు అందజేస్తారన్నారు.

దేవరపల్లిలో..

దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యే గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తారని చెప్పారు.

విద్యార్థిని నాగశ్రీకి 'మానవత' ఆర్థిక సాయం

దేవరపల్లి: కృష్ణంపాలెంకు చెందిన కడలి నాగశ్రీ అనే పేద విద్యార్థిని చదువుకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ప్రతినిధులు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. నాగశ్రీ ఇంటర్ మీడియెట్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. నాగశ్రీ కళాశాల ఫీజుల కోసం మానవత సంస్థ ప్రతినిధులు బలుసు సత్యనారాయణ, పప్పు వెంకట రామారావు, ఎలమాటి సత్యనారాయణ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం ఆమెకు అందజేశారు. అలాగే స్థానిక ఊర చెరువు వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్రీజర్, వాహనం భద్రపరిచే భవనం నిర్మాణానికి మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.30 వేలు విరాళంగా అందజేశారు. కేశిరాజు సీతారామయ్య, బండి సూర్యప్రకాశరావు, మాధవరపు వెంకటేశ్వరరావు, ఈద్పుగంటి నాగేశ్వరరావు, తీగెల లక్ష్మీనారాయణ, ఆచంట సుబాష్ చంద్రబోస్ ఒక్కొక్కరు రూ. ఐదు వేల చొప్పున విరాళం అందజేశారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

- కొందరు కౌన్సిలర్ల నిరసన గళం
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్పర్సన్ భావన రత్నకుమారి

కొవ్వూరు: వివిధ అభివృద్ధి పనులకు కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపి ంది. చైర్పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నాలుగో వార్డు కమ్యూనిటీ హాల్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. రూ.18.25 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో 18, 6 వార్డుల్లో తారు రోడ్ల నిర్మాణం, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.33.65 లక్షలతో వివిధ ప్రాంతాల్లో తారురోడ్ల మరమ్మతులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గుంతలు పడిన వివిధ రోడ్ల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు రూ.23 లక్షలతో 23వ వార్డులో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఒకటి నుంచి 14వ వార్డుల్లో 46 వీధి దీపాల స్తంభాల ఏర్పాటుకు రూ.8.28 లక్షలు సాధారణ నిధులు చెల్లించేందుకు అంగీకరించారు. యానాద కాలనీకి అల్లూరి బాపినీడు కాలనీగా పేరు మార్పునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 10వ వార్డులో శంఖాబత్తుల వారి వీధిలో రోడ్డు నిర్మాణానికి సాధారణ నిధులు రూ.10 లక్షల వెచ్చించేందుకు ఆమోదించింది.

అజెండాలోని 14,15 అంశాలైన వాటర్ వర్క్స్ పనులను వేసవి కార్యాచరణ ప్రణాళికలో చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో ఈ రెండు అంశాలను రద్దు చేస్తున్నట్టు చైర్ పర్సన్ రత్నకుమారి ప్రకటించారు.

రూ.35 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్

వేసవిని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద పట్టణంలో వివిధ పనులకు రూ.35 లక్షలు ఖర్చుచేసే ప్రణాళికకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో 14వ వార్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.7.40 లక్షలు కేటాయించారు. విద్యుత్తు శాఖకు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.11లక్షలు చెల్లించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కొత్తగా ప్రతిపాదించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్పై కౌన్సిల్ సభ్యులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్కాయ్బ్లూ సంస్థ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని కోరారు. డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్పై సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం తగదని బీజేపీ సభ్యుడు పిల్లలమర్రి మురళీకృష్ణ ఆరోపించారు. తాము వార్డు ప్రజలకు ఏ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 2041 వరకూ ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని డ్రాఫ్టమాస్టర్ ప్లాన్ తయారు చేశారని కమిషనర్ బి.శ్రీకాంత్ వివరణ ఇచ్చారు. రుడా ఆధ్వర్యంలో త్వరలోనే అవగాహన సదస్సు ఏర్పాటు చేయిస్తామన్నారు.

సమస్యలపై సభ్యుల మండిపాటు

సమావేశం జీరో అవర్లో సభ్యులు సమస్యలపై గళమెత్తారు. తమ తమ వార్డుల్లోని సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పనుల కేటాయి ంపులపై 12వ వార్డు కౌన్సిలర్ అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, 11వ వార్డు కౌన్సిలర్ తోట లక్ష్మీప్రసన్న, బత్తి నాగరాజు, వరిగేటి లలితకుమారి, కంఠమణి రమేష్, మద్దిపట్ల సాయిగీత అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని వార్డులకే నిధుల కేటాయింపులు చేస్తున్నారని, తాము సూచించిన పనులను మాత్రం చేయడం లేదని మండిపడ్డారు. ప్రాధాన్యతను గుర్తించి నిధులు కేటాయించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ గోపాలపురం మండల విభాగాల అధ్యక్షులు వీరే

గోపాలపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గోపాలపురం మండలానికి వివిధ విభాగాల నూతన అధ్యక్షులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ప్రకటించారు. మండల శాఖ అధ్యక్షుడు- పోతిరెడ్డి నాగరాజు (దొండపూడి), మహిళా విభాగం అధ్యక్షురాలు -యండపల్లి కవిత (గోపవరం), యువత- కాసాని సతీష్బాబు (నాని) (దొండపూడి), ఎస్సీ సెల్- గెల్లా వెంకట శ్రీను (గోపాలపురం), రైతు సంఘం- కోలా రాములు (కరిచర్లగూడెం), పంచాయతీరాజ్ కమిటీ- బేదంపూడి ఝాన్సీ (హుకుంపేట), వాణిజ్య విభాగం- మద్దు జగన్మోహన్రావు (గోపాలపురం), ప్రచార కమిటీ- నక్కా పోశిబాబు(రాంపాలెం), సేవాదళ్- ముచ్చికర్ల రవి (చిట్యాల), మైనార్టీ సెల్- ఎస్కే మస్తాన్బాబా (కొవ్వూరుపాడు), బీసీ సెల్- దూదిపాళ ప్రభాకర్(గుడ్డిగూడెం), ఎస్టీ సెల్- సుయంకు కన్నయ్య (సంజీవపురం)లను నియమించినట్టు ఎమ్మెల్యే వివరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఘనత జగన్దే



104 నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి

నల్లజర్ల: దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం జగన్కే దక్కుతుందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నల్లజర్ల పీహెచ్సీకి ప్రభుత్వం సమకూర్చిన 104 అదనపు వాహనాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. సీహెచ్ఓ చంద్రశేఖరరాజు ఆసుపత్రి వైద్య సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజుద్దీన్, సాంబశివరావు, డాక్టరు నాగదేవి, డాక్టరు ప్రిన్స్, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, జెడ్పీటీసీ సభ్యులు ముప్పిడి లక్ష్మి, పొట్టి స్వర్ణలత, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, సర్పంచ్ పల్లి జ్యోతి, తహసీల్దారు కిశోర్కుమార్, ఎంపీడీఓ జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్

పెరవలి: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా పెరవలిలో సోమవారం పశుసంవర్ధక శాఖ అధికారులు టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సల్మా మాట్లాడుతూ మండలానికి 140 వ్యాక్సిన్ బాటిల్స్ వచ్చాయన్నారు. ఒక్కొక్క బాటిల్ 50 డోసులు వస్తుందని, మండలంలో ఏడు వేల పశువులు ఉన్నాయని వివరించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం సోమవారం నుంచి వచ్చే నెల 24 వరకూ కొనసాగుతుందన్నారు. ఎంపీడీవో రమేష్, వైఎస్సార్సీపీ మండలశాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, నాయకులు కొమ్మిశెట్టి కిచ్చు, వేణు పాల్గొన్నారు.